సాక్షి పెద్దపల్లి

గురువారం । 14 । నవంబర్ । 2024



గోదావరిలో పారిశుధ్య పనులు

రామగుండం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గోదావరి నదిలో పారిశుధ్య పనులు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది ఈ చర్యలు తీసుకున్నారు.



నాణ్యమైన ధాన్యానికే 'మద్దతు'

పెద్దపల్లిరూరల్: నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని డీసీవో శ్రీమాల సూచించారు. గౌరెడ్డిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు.

గరిష్టం/కనిష్టం
32.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. పగలు ఉక్కపోతగా, రాత్రి చలిగా ఉంటుంది. రోజంతా పొడివాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఎన్టీపీసీ డైరెక్టర్ రాక



షణ్ముగసుందరం

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకలకు ఆ సంస్థ డైరెక్టర్(ప్రాజెక్టు) షణ్ముగసుందరం గురువారం ఇక్కడ పర్యటిస్తారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లో ఉదయం జరిగే మార్నింగ్ వాక్‌లో సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో కలిసి ఆయన పాల్గొంటారు. అనంతరం పరిపాలనా భవనంలో ఆవిర్భావ వేడుకలు, సాయంత్రం కాకతీయ ఆడిటోరియంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరవుతారు. ఎన్టీపీసీ ఆవిర్భవించి 50 ఏళ్లు, రామగుండం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి 40 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 16న క్రీడా మైదానంలో బాలివుడ్ స్టార్స్‌తో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రభావిత గ్రామాల్లో పర్యటన



పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్ తరుణ్

గోదావరిఖని: ఎన్విరాన్‌మెంట్, అటవీ, వాతావరణ మార్పుల కేంద్ర డైరెక్టర్ తరుణ్ కత్తుల సింగరేణి ప్రభావిత గ్రామాల్లో గురువారం పర్యటించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఆర్నెల్లకోసారి ప్రభావిత ప్రాంతాలను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా సింగరేణి సమీప, పరిసరాల్లో రేమిడేషన్ ప్లాన్, నేచురల్ కమ్యూనిటీ రిసోర్స్ గురించి జనగామ, సుందిళ్ల, ముస్యాల గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. జీడీకే- 2, 2ఏ గని సమీపంలో నిర్మిస్తున్న 17 ఎంఎల్‌డీ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం సైదులు, అధికారులు రవికిరణ్, శ్రీనివాసు, ఆంజనేయ ప్రసాద్, కర్ణ, వసంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

'బోనస్' దీక్ష విరమణ



నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

పాలకుర్తి(రామగుండం): కార్మికులకు మెరుగైన బోనస్ చెల్లించాలనే డిమాండ్‌తో బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కంపెనీ పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను బుధవారం విరమించారు. పదిరోజులుగా కార్మిక సంఘం నాయకులు, కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ విషయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కంపెనీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. వారి ఆదేశాల మేరకు స్థానిక ప్లాంట్‌హెడ్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథి నాయకులతో చర్చించారు. రెండుమూడ్రోజుల్లో బోనస్ సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు దీక్ష విరమిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. యూనియన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, రాజు, నారాయణ, ప్రసాద్, రాంమూర్తి పాల్గొన్నారు.

మహిళా బెటాలియన్ ఏర్పాటు అభినందనీయం

జ్యోతినగర్(రామగుండం): సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో ప్రత్యేక మహిళా బెటాలియన్‌ను వెయ్యి మంది సిబ్బందితో కేంద్రప్రభుత్వం ఏర్పాటు అభినందనీయమని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు భద్రతా విభాగం పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముఖేశ్‌కుమార్ బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు రెండు లక్షల మంది సిబ్బంది ఉన్న సీఐఎస్ఎఫ్‌లో ప్రత్యేకంగా మహిళా బెటాలియన్ ఏర్పాటు చేయడంతో విమానాశ్రయాలు, కీలక ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మహిళల సాధికారత, జాతీయ భద్రతలో వారి పాత్రను పెంచే లక్ష్యంతో ప్రత్యేక తొలిమహిళా బెటాలియన్ ఏర్పాటుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆమోదం తెలియజేయడం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.

క్వింటాలు పత్తి రూ.7,002

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.7,002 ధర నమోదైందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. కనిష్టంగా రూ.5,956, సరాసరి రూ.6,811గా ధర నిర్ధారించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన 1,759 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రత్యామ్నాయమే ఆదుకుంది!

- పెద్దపల్లి–నిజామాబాద్ రూట్లో 16 రైళ్ల మళ్లింపు
- నాటి ప్రధాని పీవీ ముందుచూపు ఫలితం
- చొప్పదండి, జగిత్యాల మార్గంలో రోజంతా గేటు కష్టాలు
- రాఘవాపూర్ ఘటనతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- బోసిపోయిన రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట స్టేషన్లు



రాఘవాపూర్ సమీపంలో బుధవారం రాత్రి కొనసాగుతున్న రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వే లైన్ ప్రాధాన్యం మరోసారి చర్చకు వచ్చింది. వాస్తవానికి ఈ మార్గాన్ని గూడ్స్ బండ్లు నడిపేందుకు మాత్రమే ఎక్కువ వినియోగిస్తున్నారు. వాణిజ్యపరంగా లాభసాటిగా ఉన్నా ఆశించిన మేర ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడం లేదు. కానీ, గూడ్స్ రైలు ప్రమాదంతో ఈ రూట్ ప్రాధాన్యం ఏంటో దక్షిణ మధ్య రైల్వే అధికారులకు మరోసారి తెలిసి వచ్చింది. ఢిల్లీ, మహారాష్ట్ర వెళ్లాల్సిన 16 నుంచి 20 రైళ్లను బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ మీదుగా మళ్లించారు. దీంతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట రైల్వేస్టేషన్లు బోసిపోయాయి.

రైలుగేట్లు పడటంతో ఇబ్బందులు

కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద చొప్పదండి మీదుగా మంచిర్యాల వైపు వెళ్లే ప్రయాణికులు బుధవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాఘవాపూర్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో ఢిల్లీ వైపు వెళ్లే రైళ్లను కరీంనగర్ మీదుగా మళ్లించడంతో కరీంనగర్, ఆరెపల్లి, గంగాధర ప్రాంతాల్లో పలుమార్లు రైలు గేట్లు వేయాల్సి వచ్చింది. దీంతో చొప్పదండి మీదుగా కరీంనగర్‌కు వచ్చే అంబులెన్సులు, అందులోని రోగులు, వాహనాదారులు, కరీంనగర్ నుంచి ఎన్‌హెచ్–563 మీదుగా జగిత్యాల, నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్‌లో నిర్మిస్తున్న ఆర్వోబీ పనులు నత్తనడకన సాగుతుండటంతో వీరి కష్టాలను మ రింత పెంచుతోంది.



రైళ్లు రద్దు కావడంతో ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

1993లో పెద్దపల్లిలో శంకుస్థాపన

1993లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ముందుచూపు వల్ల పెద్దపల్లి–నిజామాబాద్ మార్గం మనుగడలోకి వచ్చింది. ఆ ఏడాది జూన్ 30న పెద్దపల్లిలో ఈ రూట్‌కు(178 కిలోమీటర్లు) శంకుస్థాపన చేశారు. అయితే, నిధుల కేటాయింపులో పెద్దగా ప్రాధాన్యం దక్కకపోవడంతో పూర్తవడానికి (2017లో విద్యుదీకరణ) 24 ఏళ్లు పట్టింది. అయినా, నేటికీ ఇది సింగిల్ లైన్‌గానే కొనసాగుతోంది తప్ప డబ్లింగ్‌కు నోచుకోవడం లేదు. అదే సమయంలో కొత్తపల్లి–మనోహరాబాద్(151 కి.మీ.) మార్గం రెండేళ్లలో పూర్తవనుంది. అలాగే, ఆర్మూర్–ఆదిలాబాద్ (121 కి.మీ.) లైన్ పూర్తయితే.. భవిష్యత్తులో కరీంనగర్ ఈ ప్రాంతానికి రైల్వే కేంద్రంగా మారనుంది. ప్రస్తుతం కాచిగూడ, తిరుపతి, దాదర్‌ముంబై తదితర కొన్ని రైళ్లు మాత్రమే ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గాన్ని డబ్లింగ్ చేసి, రెగ్యులర్ రైళ్లు నడిపితే ఉత్తర తెలంగాణ రవాణాలో సరికొత్త అధ్యాయం లిఖిస్తుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీసీ ఏర్పాట్లు..



ప్రమాద స్థలానికి వెళ్తున్న కలెక్టర్ శ్రీహర్ష

రాఘవాపూర్ వద్ద రైలు పట్టాలు తప్పడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే కరీంనగర్ ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాలలో దిగాల్సిన ప్రయాణికుల కోసం అర్ధరాత్రి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు వేసి, గమ్యస్థానాలకు చేర్చారు. అదే సమయంలో కాజీపేట–బల్హార్షా మీదుగా నడిచే 39 రైళ్లను పూర్తిగా, 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 61 రైళ్లను దారి మళ్లించారు. మరో ఏడింటిని రీషెడ్యూల్ చేయడంతో దూరప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చెన్నై నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి గయా వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి లక్నో బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, మధురై నుంచి ఢిల్లీ నిజాముద్దీన్ తమిళనాడు సంపర్క్ క్రాంతి, ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి దానాపూర్ పాట్నా సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్ నుంచి తిరునల్వేలి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను పెద్దపల్లి–నిజామాబాద్ మార్గంలో మళ్లించారు. దీంతో ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ఆయా రూట్లలో రద్దీ పెరిగింది.



బాలల నేస్తం.. చాచా నెహ్రూ..

నేటి బాలలే రేపటి పౌరులు, రేపటి జాతి సంపదలు.. విరిసివిరియని కుసుమాలు సరైన విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చు సుసంపన్నమైన దేశం కోసం.. సిద్ధమవుతున్న నేటి ఆణిముత్యాలే రేపటి మన జాతి రత్నాలు. తల్లిదండ్రుల కలల ప్రతిరూపాలు.. భావి భారత పౌరులు. వారికి విద్యతోపాటు మంచి విలువలను నేర్పుదాం. పాలబుగ్గల నవ్వులు, అపురూపమైన క్షణాలు.. మరపురాని జ్ఞాపకాలు.. బాల్యం ఒక వరం. పిల్లలు భగవంతుని స్వరూపాలు.. కల్లకపటం ఎరుగని కరుణామయులు.. రివ్వున ఎగిరే గువ్వలు..

నవంబర్ 14 వచ్చింది.. బాలలకు బోలెడు సందడి తెచ్చింది. ఈ రోజంటే పిల్లలకు పండగ లాంటిది. బాలల దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా వేడుకలా జరుపుకొంటారు. నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ. పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమానిన ప్రేమ. ఆయణ్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకుంటారు. అందుకే 1889 నవంబర్ 14న నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవం జరుపుకుంటారు. ఆయన బర్త్‌డేను 'చిల్డ్రన్స్ డే' నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం ఉంటుంది. పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లు, ఇతర కానుకలను పంచిపెడతారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో ఉత్సాహం నింపుతారు. హ్యాపీ చిల్డ్రన్స్ డే..

8,946 మంది అభ్యర్థులు.. 18 పరీక్ష కేంద్రాలు

- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ వెల్లడి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించే గ్రూప్ - 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా గ్రూప్– 3 పరీక్షలకు 8,946మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరికోసం 18 పరీక్ష కేంద్రాలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతీ మూడు పరీక్ష కేంద్రాలకు తహసీల్దార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించామన్నారు. ఈనెల 17న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే 18న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ప్రతీ 150 మందికి ఓ జూనియర్ అసిస్టెంట్ స్థాయి సిబ్బందిని ఐడెంటిఫికేషన్ అధికారిగా నియమించినట్లు అరుణశ్రీ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 8.30 గంటల నుంచే అభ్యర్థులను అనుమతిస్తారని ఆమె పేర్కొన్నారు. సీ - విభాగం సూపరింటెండెంట్ బండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

ఏర్పాట్లపై వీడియోకాన్ఫరెన్స్..

గ్రూప్ - 3 పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పరీక్షల సన్నద్ధతకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కేంద్రాలున్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, పోలీసు బందోబస్తు మధ్య ప్రశ్నాపత్రాలను తరలించాలని సూచించారు. కలెక్టర్ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం బస్సు ప్రారంభం

గోదావరిఖనిటౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లే ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును డీఎం నాగభూషణం బుధవారం ప్రారంభించారు. ప్రయాణికులకు యాపిల్స్, పులిహోర ప్యాకెట్లు అందజేశారు. వీరికోసం ఒక గైడ్‌ను కూడా నియమించారు. ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





విద్యుత్ వెలుగుల్లో ఎన్టీపీసీ

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైంది. బుధవారం రాత్రి విద్యుత్ చిమ్నీలపై ఎల్‌ఈడీ లైట్లు, లేజర్ షోతో అద్భుత దృశ్యం ఆవిష్కరించింది. ఎన్టీపీసీ సంస్థ పేరును మూడు భాషల్లో ప్రదర్శించడం కనువిందు చేసింది. 50 ఏళ్ల ఎన్టీపీసీ ప్రస్థానం, రామగుండంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి 40 ఏళ్లు పూర్తవుతుందన్న సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు.

ఉత్పత్తి లక్ష్యంపై మేధోమథనం

- ఏరియాల్లో పర్యటిస్తున్న టార్గెట్ కమిటీ బృందాలు

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి పెంపుపై సింగరేణి మేధోమథనం ప్రారంభించింది. వచ్చే ఏడాది 74 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈమేరకు అన్ని ఏరియాల్లో టార్గెట్ కమిటీ బృందాలు పర్యటిస్తున్నాయి.

ఉత్పత్తి లక్ష్యం 74 మిలియన్ టన్నులు

2025–26 ఆర్థిక సంవత్సరంలో కనీసం 74 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించిన సింగరేణి బొగ్గు గనుల సంస్థ.. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం నాలుగు నెలల ముందుగానే కార్యాచరణ రూపొందిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షిస్తోంది. గనులు, ఏరియాల వారీగా లక్ష్యం నిర్దేశించే టార్గెట్ కమిటీలు.. ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా పర్యటిస్తూ అంచనాలు రూపొందిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెలికి తీసిన బొగ్గు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గనులు, ఓసీపీల్లోని బొగ్గు నిల్వలు, ఏరియాల్లోని కార్మికులు, యంత్రాల ఆధారంగా టార్గెట్ కమిటీలు లక్ష్యం నిర్దేశిస్తున్నాయి.

అత్యధిక ఉత్పత్తిలో ఐదు ఏరియాలు..

సింగరేణిలోని కొత్తగూడెం, మణుగూరు, ఆర్జీ–1, 2, 3 ఏరియాలు అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా టార్గెట్ కమిటీలు వీటిపైనే అధిక ఫోకస్ పెట్టాయి. రాబోయే ఏడాదిలో కూడా ఏరియాల్లోని ప్రగతిని బట్టి ఉత్పత్తి లక్ష్యం సాధించాలని నిర్ణయించాయి.



ఉత్పత్తిపై సమీక్షిస్తున్న టార్గెట్ కమిటీ ప్రతినిధులు

వారం రోజులుగా పర్యటన..

సింగరేణిలోని 11 ఏరియాల వారీగా టార్గెట్ కమిటీలు వారం రోజులుగా పర్యటిస్తున్నాయి. అధికారులతో ఉత్పత్తిపై సమీక్షిస్తున్నాయి. అందుబాటులో ఉన్న వనరులు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అవసరమైన నిధులు, వెలికి తీయాల్సిన బొగ్గు, ఓవర్ బర్డెన్ గురించి చర్చిస్తున్నాయి.

నైనీ బ్లాక్‌తో భారీగా ఉత్పత్తి

ఒడిశా రాష్ట్రంలోని నైనీ బ్లాక్‌లో గతేడాది 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తీయాలని లక్ష్యంగా నిర్దేశించారు. పర్యావరణ అనుమతులు, ఇతర సమస్యలతో నైనీ బ్లాక్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించలేదు. దీంతో సంస్థ వార్షిక లక్ష్యం పెరగలేదు. ఈసారి కూడా 10 మిలియన్ టన్నుల లక్ష్యం నిర్దేశించే అవకాశాలు ఉన్నాయి. ఈసారైనా నైనీ బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తే అమాంతం పది మిలియన్ టన్నులు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

'దిశ'.. నిర్దేశం చేసేనా?

- ఇప్పటివరకు ఒక్కసారి కూడా సమావేశం కాని కమిటీ
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించని వైనం
- ప్రతిపాదనల రూపకల్పనలో కొరవడిన యంత్రాంగం చొరవ
- నేడు నిర్వహించనున్న సమీక్ష సమావేశంపై జిల్లావాసుల ఆసక్తి

కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టే పథకాలు, వాటి అమలు, క్షేత్రస్థాయిలోని సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు ఉద్దేశించిన 'దిశ' సమావేశం ఎట్టకేలకు ఈనెల 14న(గురువారం) నిర్వహించనున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ 90 రోజులకోసారి సమావేశం కావాలి. కానీ, కమిటీ ఎన్నికైన నాటినుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. ఫలితంగా పథకాల ఫలాలు అర్హులకు చేరడంలో జాప్యమవుతోందనే విమర్శలు ఉన్నాయి.



సాక్షి, పెద్దపల్లి: జిల్లా ప్రగతి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం ఎంపీ అధ్యక్షతన నిర్వహిస్తారు. ఇందులో కలెక్టరుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, నామినేటెడ్ సభ్యులు, కేంద్ర పథకాలు అమలు చేస్తున్న ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటికి కేటాయించే నిధులతో కొనసాగుతున్న పనులపై 'దిశ' క్షుణ్నంగా సమీక్షించాలి. కేంద్రప్రభుత్వం పరిధిలోని 29 శాఖల పనితీరుపై చర్చించాలి. ఇప్పటివరకు ఉన్న పురోగతి సమీక్షించి కొత్తగా చేపట్టాల్సిన పనులపై చర్చించాలి. అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపించాలి. ఇప్పటివరకు ఆ దిశగా అడుగులు పడిన దాఖలాలు లేవు.. ఎట్టకేలకు ఈనెల 14న దిశ సమావేశమవుతుందని అధికారులు ప్రకటించడం కొంత ఊరటనిస్తోంది.

ఎంపీ అధ్యక్షతన..

జిల్లా ప్రగతి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం ఎంపీ అధ్యక్షతన నిర్వహిస్తారు. ఇందులో కలెక్టరుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు, నామినేటెడ్ సభ్యులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారు. కేంద్రప్రభుత్వ పథకాలు, అది అందించే నిధులతో కొనసాగుతున్న పనులపై ఇందులో క్షుణ్నంగా చర్చిస్తారు. ఈ సమావేశంలో కేంద్రప్రభుత్వ పరిధిలో ఉన్న 29 శాఖల పనితీరుపై సమీక్షించాల్సి ఉంది. ఇప్పటివరకు ఉన్న పురోగతిని సమీక్షించి కొత్తగా చేపట్టాల్సిన వాటి గురించి చర్చించాలి. అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి. ఆ దిశగా అడుగులు పడటం లేదు.

పథకాలపై కొరవడిన పర్యవేక్షణ

ఎంపీ ల్యాండ్స్‌తోటు కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, పీఎం ఫసల్ బీమా యోజన, ముద్ర రుణలు, పీఎం ఆవాస్‌యోజన్ తదితర పథకాల అమలుపై నిర్మాణాత్మక చర్చ జరిగితే ప్రయోజనకరంగా ఉంటుందని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

లోటుపాట్లు విజిలెన్స్‌కు..

పథకాల్లో లోటుపాట్లను ఎత్తిచూపడంతోపాటు విజిలెన్స్‌కు నివేదిక పంపించే అధికారం దిశకు ఉంటుంది. సమీక్ష లేక పథకాల అమలుపై పర్యవేక్షణ కొరవడింది. ఇదే విషయమై డీఆర్‌డీవో రవీందర్‌ను వివరణ కోరగా పాత కమిటీని రద్దు చేసి, కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 14న 'దిశ' సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పెద్దపల్లిపై చిన్నచూపు

తెలంగాణ రాష్ట్రం అధికారికంగా 2014 జూన్ 2న ఆవిర్భవించింది. ఆ తర్వాత ఐదేళ్ల వ్యవధిలో ఉమ్మడి కరీంనగర్ దిశ కమిటీ సమావేశాలు ప్రతీమూడు నెలలకోసారి కచ్చితంగా జరిగేవి. గతంలో జిల్లా ఉన్నతాధికారులు కూడా తరచూ ఇతర జిల్లాలతో పోల్చుతూ వివిధ అంశాలు తెరపైకి తీసుకొచ్చేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత కూడా ఆయా దిశ కమిటీ చైర్మన్లు సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. జిల్లా దిశ కమిటీ సమావేశం 2020 అక్టోబర్ 20న అప్పటి ఎంపీ అధ్యక్షతన ఒకసారే సమావేశమైంది. ఆ తర్వాత ఇప్పటిదాకా సమావేశం నిర్వహించలేదు. ప్రస్తుత పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎన్నికై సుమారు పది నెలలు గడుస్తున్నా సమీక్ష సమావేశం నిర్వహించలేదు. ఇటీవల మంచిర్యాలలో దిశ సమావేశం నిర్వహించినా.. పార్లమెంట్ కేంద్రమైన పెద్దపల్లిలో సమీక్ష నిర్వహించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తూకంలో కోత విధిస్తే చర్యలు

- సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తాం
- మొలకెత్తిన ధాన్యం కొనుగోలుకు చర్యలు
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఠాకూర్

రామగుండం: ధాన్యం తూకంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. సన్నరకం ధాన్యానికి బోనస్ చెల్లిస్తామన్నారు. మొలకెత్తిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని ఆయన వెల్లడించారు. అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, బ్రాహ్మణపల్లి, ముర్మూర్, ఎల్లంపల్లిలో బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ మామిడాల ప్రభాకర్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్కాగా కుటుంబ సర్వే



ధాన్యం కొనుగోళ్లు పరిశీలిస్తున్న కలెక్టర్

ఓదెల(పెద్దపల్లి): సామాజిక సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కొలనూర్, లంబాడితండా గ్రామాల్లో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు, ఇంటింటి సర్వే తీరును ఆయన బుధవారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ కుటుంబ వివరాలు పూర్తిగా సేకరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్ల సాయంతో ధాన్యం శుభ్రం చేయాలని సూచించారు. తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో తిరుపతి పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండ



డ్రైనేజీ పనులను పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: చిరువ్యాపారులకు అన్యాయం జరగకుండా చూస్తానని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. బుధవారం రాత్రి స్థానిక ప్రధాన చౌరస్తా, లక్ష్మీనగర్‌లో ఆయన పర్యటించారు. నగర సుందరీకరణలో భాగంగా సింగరేణి చేపట్టిన పనులను పరిశీలించారు. చిరువ్యాపారులతో ఆయన మాట్లాడారు. వారి అనుమానాలు నివృత్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. నాయకులు, కార్పొరేటర్లు ఉన్నారు. అలాగే స్థానిక ఇందిరానగర్‌లో రూ.40లక్షలతో చేపట్టిన ఓపెన్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. కార్పొరేషన్ ప్రాంత అభివృదద్ధికి రూ.వంద కోట్లు మంజూరయ్యాయని అన్నారు. నగర అభివృద్ధికి ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు.

విజేత పెద్దపల్లి జట్టు



మాట్లాడుతున్న డీఈవో మాధవి

మంథని: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–17 బాలుర క్రికెట్ పోటీల్లో పెద్దపల్లి జిల్లా జట్టు ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి అందుకుంది. ఉమ్మడి నుంచి పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జట్లు పోటీపడ్డాయి. ఇందులో పెద్దపల్లి జట్టు ప్రథమ, సిరిసిల్ల జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎంపికైన జట్లు మహబూబ్‌నగర్‌లో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాధవి, ఎంఈవో దాసరి లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్ వీకే రవి, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు రద్దు.. బస్సులు ఫుల్లు

- శరవేగంగా రైల్వే పట్టాల పునరుద్ధరణ
- ఇరువైపులా దాదాపు 80 రైళ్ల వరకు రద్దు
- పునరుద్ధరణపై స్పష్టత ఇవ్వని రైల్వే అధికారులు
- ప్రయాణికుల కోసం రామగుండం, పెద్దపల్లిలో హెల్ప్‌డెస్క్‌లు
- మరమ్మతులు పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎంపీ వంశీకృష్ణ



ఆర్టీసీ బస్సులో కిక్కిరిసి ఎక్కుతున్న ప్రయాణికులు

సాక్షి, పెద్దపల్లి/రామగుండం: రాఘవాపూర్ – రామగుండం రైల్వేస్టేషన్ల మధ్య అప్‌ట్రాక్‌పై గూడ్సు రైలు మంగళవారం రాత్రి పట్టాలు తప్పడంతో ఆయా రైల్వేస్టేషన్లలో నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్లలోని ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకునేందుకు నరకయాతన అనుభవించారు. ఐరన్ లోడ్‌తో వెళ్తున్న గూడ్సురైలు పట్టాలు తప్పడంతో ప్రధాన మార్గంలోని మూడు ట్రాక్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఫలితంగా న్యూఢిల్లీ – చెన్నై మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లావాసులు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి దేశవ్యాప్తంగా ప్రయాణాలు చేస్తుంటారు. వీరంతా రైళ్లరాకపోకల నిలిపివేతతో గమ్యస్థానాలు చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టికెట్లు రిజర్వేషన్ చేయించుకున్న వారు ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. సుదూర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లేవారు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్‌మెట్రో సిటీస్‌లో ఉపాధి కోసం వచ్చివెళ్లే కూలీలు ఉన్నారు. అయితే, రిజర్వేషన్ ప్రయాణికులకు వందశాతం రిఫండబుల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మరోవైపు.. ప్రయాణికుల కోసం రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్లలో అధికారులు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులు ప్రత్యేక బస్సులు నడిపించినా మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. మరోవైపు.. తరచూ మరమ్మతుల పేరిట నెలల తరబడి ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రైల్వేశాఖ రద్దు చేస్తుండడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దపల్లిలో హెల్ప్‌డెస్క్

పెద్దపల్లిరూరల్/ఓదెల/పాలకుర్తి: రైలు ప్రయాణికులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వీలుగా పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. రాఘవాపూర్–కన్నాల మధ్య దెబ్బతిన్న రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రైల్వేస్టేషన్లు వెలవెల

జిల్లాలోని రైల్వేస్టేషన్లు బుధవారం ప్రయాణికులు లేక వెలవెలబోయాయి. ఈ మార్గంలో నడిచే భాగ్యనగర్, సిర్పూర్‌కాగజ్‌నగర్, రామగిరి, ఇంటర్‌సిటీ రద్దవడంతో పెద్దపల్లి, రామగుండం, జమ్మికుంట, ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, మంచిర్యాల రైల్వేస్టేషన్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రస్తుతం వివాహాలు జరుగుతుండడంతో బంధువులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

పనులు పర్యవేక్షించిన రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

మహారాష్ట్రలోని బల్హార్ష నుంచి సికింద్రాబాద్ వరకు వివిధ ప్రాంతాల్లోని రైల్వే శాఖకు చెందిన వందలాది మంది సిబ్బందితోపాటు ప్రైవేట్ కార్మికులు ట్రాక్‌ల పునరిద్ధరణలో పాలుపంచుకుంటున్నారు. భారీ క్రేన్లు, జేసీబీలు, పొక్లెయిన్ల సాయంతో ట్రాక్‌లపై పడిపోయిన వ్యాగన్లను తొలగించారు. రైల్వేతోపాటు సింగరేణి, ప్రైవేటు సంస్థల యంత్రా సామగ్రినీ రైల్వేశాఖ వినియోగిస్తోంది. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ పర్యవేక్షణలో మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయి. కాజీపేట రైల్వే డీఎస్పీ కృపాకర్, సీఐలు, రామ్మూర్తి, సురేశ్‌గౌడ్, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్, రైల్వే ఎస్సైలు, ఆర్పీఎఫ్ సిబ్బంది సహాయక చర్యలను పర్యవేక్షించారు. బుధవారం రాత్రి వరకు రెండు ట్రాక్‌లను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని, మధ్యలైన్‌ను గురువారం వరకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు వివరించారు.

ప్రమాదాలపై సమీక్షించాలి : ఎంపీ వంశీకృష్ణ

గత పదేళ్లతో పోలిస్తే ఏడాది నుంచి రైలు ప్రమాదాలు బాగా పెరిగాయని, వీటిపై కేంద్ర రైల్వేశాఖ మంత్రి సమీక్షించి నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. రైలు ప్రమాద ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదంపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్యాసింజర్ రైలు ఇలాంటి ప్రమాదానికి గురై ఉంటే ఊహించలేనంత ప్రాణనష్టం జరిగి ఉండేదన్నారు.



పెద్దపల్లి బస్టాండ్‌లో వేచియున్న ప్రయాణికులు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వంశీకృష్ణ



బోసిపోయి కనిపిస్తున్న ఓదెల రైల్వేస్టేషన్



పెద్దపల్లిలో రైళ్ల కోసం ప్రయాణికుల ఆరా..











రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణకు వినియోగిస్తున్న భారీ వాహనాలు, రామగుండంలో రిజర్వేషన్లు రద్దు చేసుకుంటున్న ప్రయాణికులు, ట్రాక్ మరమ్మతుల్లో రైల్వే సిబ్బంది నిమగ్నం, విద్యుత్ తీగలు సరిచేస్తున్న సిబ్బంది, గూడ్సు రైలు పట్టాలు తప్పిన ప్రాంతంలోని రాఘవాపూర్ రైల్వేస్టేషన్ ఇదే..

ఒకే అకౌంట్‌లో వందల కోట్లు మార్పిడి!

- స్టాక్‌మార్కెట్ పేరిట సైబర్ క్రైం
- రెండు నెలల క్రితం మెట్‌పల్లి వైద్యుడి ఫిర్యాదు
- పోలీసుల విచారణలో నివ్వెరపోయే నిజాలు
- అదుపులో పంజాబ్‌కు చెందిన ముగ్గురు నిందితులు





కోరుట్ల: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వందలాది కోట్ల మార్పిడి. మూడేళ్లలో ఓ వ్యక్తి ఖాతాలోకి మళ్లిన నగదు గురించి తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. స్టాక్ మార్కెట్ పేరిట ఓ ముఠా చేసిన సైబర్‌నేరం ఇది. మెట్‌పల్లికి చెందిన వైద్యుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తీగ లాగితే డొంగ కదిలింది. రెండు నెలల క్రితం జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లికి చెందిన ఓ వైద్యుడిని స్టాక్‌మార్కెట్ యాప్ పేరిట ట్రాప్‌లోకి దించిన నిందితులు ఆయన ఖాతా నుంచి రూ.72లక్షలు కాజేశారు. తాను మోసపోయిన విషయం తెలుసుకున్న వైద్యుడు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీస్ ఉన్నతధికారులు ఓ పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి లోతైన విచారణ కోసం రంగంలోకి దించారు.

దుబాయి కేంద్రంగా..

మెట్‌పల్లి వైద్యుడి కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు విచారణ మొదలుపెట్టిన క్రమంలో స్టాక్ మార్కెట్ యాప్ పేరిట సైబర్ క్రైంకు పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. ఈ నిందితులు పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్నట్లు గుర్తించి వారం క్రితం అక్కడికి వెళ్లి మకాం వేశారు. పక్క ప్రణాళికతో ముగ్గురిని పట్టుకున్నారు. ఒక్కొక్కరి ఖాతాలను పరిశీలించి స్టాక్‌మార్కెట్ పేరిట సాగుతున్న సైబర్‌క్రైం వివరాలు విచారించారు. ఈక్రమంలో ఒకరి అకౌంట్‌లో 2021 సంవత్సరం నుంచి దాదాపుగా రూ.50వేలు కోట్ల డబ్బుల మార్పిడి జరిగినట్లుగా గుర్తించి నివ్వెరపోయారు. ఈ ముగ్గురు నిందితులకు దుబాయిలోని ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసుల అదుపులో నిందితులు..

మెట్‌పల్లి వైద్యుడిని స్టాక్‌మార్కెట్ యాప్ పేరిట సైబర్ ఉచ్చులోకి లాగిన ముగ్గురు నిందితులను జగిత్యాల జిల్లా ప్రత్యేక పోలీస్ బృందం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని పూర్తిస్థాయిలో విచారించేందుకు జలంధర్ నుంచి జగిత్యాలకు తీసుకొచ్చినట్లు తెలిసింది. దుబాయి కేంద్రంగా సాగుతున్న సైబర్ ముఠా తీరుతెన్నులు, వారితో భాగస్వామ్యులుగా ఉన్న వ్యక్తుల వివరాలు, హవాలా మార్కెట్‌తో ఏమైనా సంబంధాలున్నాయా? అన్న దిశలో పోలీస్ విచారణ కొనసాగుతోంది.

గేటెడ్ తరహాలో క్వార్టర్ల నిర్మాణం

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: గేటెట్ కమ్యూనిటీ తరహాలో గోదావరిఖనిలో వెయ్యి సింగరేణి క్వార్టర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు జరుగుతున్నాయని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక జనక్‌భవన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన, యూనియన్ బలోపేతానికి ప్రతీ నాయకుడు కష్టించి పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన ఏర్పడిన తర్వాత పెండింగ్‌లోని అనేక హక్కులు సాధించామని అన్నారు. డిపెండెంట్ కార్మికుల వయో పరిమితి 35 – 40ఏళ్లకు పెంచామని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటు, కోటి రూపాయల ప్రమాద బీమా, స్థానికులకే 80శాతం ఉద్యోగాలు, సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కొనసాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, దాస్, వికాస్‌కుమార్ యాదవ్, కొత్త సత్యనారాయణరెడ్డి, ఆరేపల్లి శ్రీనివాస్, గడ్డం కృష్ణ, పోచయ్య, గంద్ర దామోదర్, సమ్మయ్యయాదవ్, అన్వేష్, శారద, మల్లికార్జున్, జగన్మోహన్, గుండేటి శ్రీనివాస్, బేబీ శ్రీనివాస్, మండ రమేశ్, పుట్ట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట పోస్టాఫీస్‌లో విచారణ



విచారణ జరుపుతున్న సీఐ రాజుగౌడ్

రామగిరి(మంథని): మండలంలోని బేగంపేట పోస్టాఫీస్‌లో నకిలీ పాస్ పుస్తకాల వ్యవహారంపై మంథని సీఐ రాజుగౌడ్ బుధవారం విచారణ చేపట్టారు. బీపీఎం 54 మంది ఖాతాదారులకు సంబంధించిన రూ.34.87 లక్షలను కాజేసిందని గోదావరిఖని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, గ్రామంలోని ఖాతాదారుల వద్దకు వెళ్లి పాస్ పుస్తకాలను పరిశీలించామని తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ముందుకు రావాలన్నారు. ఈ ఘటనపై విచారణ పూర్తయ్యాక అన్ని వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై చంద్రకుమార్, సిబ్బంది ఉన్నారు.

పెళ్లికి హాజరై వెళ్తూ.. అనంతలోకాలకు

- కారు ప్రమాదంలో భార్య మృతి, భర్త, కూతురికి గాయాలు
- హైదరాబాద్‌లో ఘటన



రోషిణి (ఫైల్)

వేములవాడరూరల్: కూతురితో కలిసి బంధువుల పెళ్లికి హాజరయ్యారు.. అందరితో సంతోషంగా గడిపి, తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.. ఈ ఘటనలో భార్య మృతిచెందగా భర్త, కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలంలోని లింగంపల్లికి చెందిన కొలిపాక సుమన్ హైదరాబాద్‌లోని ఓ బ్యాంకులో పని చేస్తున్నాడు. భార్య రోషిణి(24), కూతురితో కలిసి అక్కడే ఉంటున్నాడు. ముగ్గురూ వేములవాడలో జరిగిన బంధువుల వివాహానికి కారులో వచ్చారు. బుధవారం ఉదయం తిరిగి హైదరాబాద్ వెళ్లారు. రింగ్ రోడ్డుపై కారు అదుపుతప్పి, ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోషిణి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె భర్త సుమన్, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాంధీ ఆస్పత్రిలో పంచనామా అనంతరం రోషిణి మృతదేహాన్ని బంధువులు స్వగ్రామం లింగంపల్లికి తీసుకొచ్చారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ బుధవారం తెలిపారు. స్థానిక ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన కూలీలు వికాస్, సుబోద్ కుమార్‌సింగ్ ఆ రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి రైస్‌మిల్లులో పనిచేస్తున్న ఇతర కార్మికులకు విక్రయిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని విచారించగా 115 గ్రాముల గంజాయి, రూ.39వేల నగదు లభించింది. వాటిని సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బొగ్గు ఉత్పత్తి టార్గెట్ కమిటీ పర్యటన

గోదావరిఖని: సింగరేణిలోని ఆర్జీ–2 ఏరియాలో బొగ్గు ఉత్పత్తి టార్గెట్ కమిటీ బుధవారం పర్యటించింది. ఓసీపీ–3, వకీల్‌పల్లి గని అధికారులతో సమీక్షించింది. బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు, యంత్రపరికరాలు, పనిస్థలాలు తదితర అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు. గనుల విస్తరణకు అవసరమయ్యే భూసేకరణ, అందులో ఎదురయ్యే సమస్యల గురించి ప్రస్తావించారు. అధికారులు ఎస్.మధుసూదన్, ఎస్.సంతోష్‌కుమార్, రాజాజీ, మురళీకృష్ణ, ఎర్రన్న, నర్సింగారావ్, చంద్రశేఖర్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టార్గెట్ కమిటీ పర్యటన నేపథ్యంలో ఆర్జీ–1 అధికారులు అంతర్గత సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జీఎం మనోహర్, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, అధికారులు సూర్యనారాయణరాజు, సాయిబాబ, వెంకయ్య, మధార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి

- కాలేయ సంబంధిత వ్యాధితో యువకుడి ఇబ్బంది

రామగిరి(మంథని): కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన భర్తను కాపాడుకోవడం, కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలు ఉన్న తన కుటుంబాన్ని సాకడం ఆ ఇల్లాలికి తలకు మించిన భారంగా మారింది. దాతలు ఎవరైనా ఉంటే తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె రెండు చేతులు జోడించి విన్నవిస్తోంది. వివరాలు.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన ఎస్‌కే గౌస్ పాషా–రేష్మా దంపతులు. వీరికి కుమారుడు తాజ్‌పాషా ఉండగా, ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి, కూతురు హలీమా మూడో తరగతి చదువుతున్నారు. అయితే, కొంతకాలం క్రితం కాలేయ సంబంధిత వ్యాధికి గురైన గౌస్‌పాషా.. కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వరంగల్ ఎంజీఎంకు వెళ్లాడు. పరీక్షించిన వైద్యులు.. జాండిస్ అధికమై కాలేయానికి ఇన్‌ఫెక్షన్ సోకిందని నిర్ధారించారు. ఇక్కడ సరైన చికిత్స లభించదని, హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. అంతదూరం వెళ్లే, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునే స్తోమత లేక స్వగ్రామానికి వచ్చిన గౌస్‌పాషా.. స్థానికంగా తాత్కాలిక చికిత్స పొందుతున్నాడు. మిత్రుల సాయంతో స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా, వైద్యఖర్చులకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు వెల్లడించారు. సొంత ఇల్లులేదు. గుంట భూమి లేదు. రోజువారీ కూలీ పనులు చేసుకునే రేష్మా.. అంతసొమ్ము ఎలా సమకూర్చేదని కన్నీటిపర్యంతమవుతోంది. దాతలు ముందుకు వచ్చి తన భర్తను కాపాడాలని ఆమె కోరుతోంది.



ఆదుకోవాలని దాతలను వేడుకుంటున్న గౌస్‌పాషా కుటుంబసభ్యులు

దాతలు సంప్రదించాల్సిన బాధితుడి బంధువుల గూగుల్ పే, ఫోన్‌పే నంబర్లు :

పాషా : 81860 07873

హైమద్ : 93472 03969